భవిష్యత్ అవసరాలకు నీటిని నిల్వ చేయాలి

కడెం ప్రాజెక్టును పరిశీలించిన రాష్ట్ర మంత్రుల బృందం

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఆగస్టు 01: భవిష్యత్తు తాగునీరు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టుల్లో నీటిని ప్రణాళికాబద్ధంగా నిల్వ చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టుల పరిస్థితిని సమీక్షించేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిలతో కూడిన మంత్రుల బృందం శనివారం కడెం ప్రాజెక్టును సందర్శించింది.ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ తెరపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తి స్థాయి నీటిమట్టం (ఎఫ్ఆర్ఎల్), ప్రస్తుత ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్న నీటి పరిమాణం, ప్రస్తుత పరిస్థితులను మంత్రులకు వివరించారు. భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి అవసరాలపై కూడా సమగ్ర సమాచారం అందించారు.ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం, భవిష్యత్తు నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటి నిర్వహణకు శాస్త్రీయ విధానాన్ని అనుసరించాలని సూచించారు. ప్రజలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాజెక్టుల నీటిమట్టాలు, పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తుందని తెలిపారు.జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా కడెం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, నీటిమట్టం, నీటి నిల్వ సామర్థ్యం, సిల్టేషన్ సమస్యలు, నీటి పారుదల నిర్వహణపై మంత్రులకు వివరించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటి వినియోగాన్ని శాస్త్రీయంగా నిర్వహిస్తూ సాగునీటి అవసరాలను తీర్చేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ప్రాజెక్టులో సిల్టేషన్ ప్రధాన సమస్యగా మారిందని, సుమారు 7.5 టీఎంసీల సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులో దాదాపు 50 శాతం వరకు పూడిక పేరుకుపోయినట్లు వివరించారు. దీనివల్ల నిల్వ సామర్థ్యం తగ్గుతున్న నేపథ్యంలో సమస్య పరిష్కారానికి దీర్ఘకాలిక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. నీటిమట్టం 674--675 మీటర్లకు చేరినప్పుడు పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ రోజుల్లో నీటి విడుదల చేపట్టే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. పూడిక సమస్యను దశలవారీగా తగ్గించి ప్రాజెక్టు నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన సాంకేతిక చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ పర్యటనలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, జిల్లా కలెక్టర్ భావేష్ మిశ్రా అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జహీరాబాద్ మండలంలో 96 శాతం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పూర్తి

పార్టీ శ్రేణులు, అధికారులకు కాంగ్రెస్ మండల అధ్యక్షులు.పి. నరసింహారెడ్డి కృతజ్ఞతలు

ఝరాసంగం ఆగస్ట్ 01 (వాయిస్ టుడే) : జహీరాబాద్ మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ 96 శాతం విజయవంతంగా పూర్తయినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పి. నరసింహారెడ్డి తెలిపారు. శనివారం మండల అధ్యక్షులు.కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో సహకరించిన బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు, సూపర్వైజర్లు, గ్రామ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న నాలుగు శాతం ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు.మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ మరియు గడ్డం వివేక్ వెంకటస్వామి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్, పార్లమెంట్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఇన్‌చార్జి అజ్మతుల్లా హుస్సేనీ, జహీరాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ ఎ. చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు ఉజ్వల్ రెడ్డి, అసెంబ్లీ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఇన్‌చార్జి మొహమ్మద్ గౌస్ పాషా.ఆదేశాల మేరకు జహీరాబాద్ మండలంలో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించినట్లు నరసింహారెడ్డి తెలిపారు..అలాగే, ఓటర్ల తొలగింపు ప్రక్రియకు సంబంధించి గాంధీభవన్ నుంచి వచ్చిన తాజా మార్గదర్శకాలను ప్రస్తావిస్తూ, ఈ ప్రక్రియకు ఇంకా గడువు ఉన్నందున ఓటర్ల తొలగింపు దరఖాస్తులపై పార్టీ నియమించిన బూత్ స్థాయి ఏజెంట్లు ప్రస్తుతం ఎలాంటి సంతకాలు చేయవద్దని ఆయన స్పష్టమైన సూచనలు చేశారు..ఈ సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ రాములు, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఇమామ్ పటేల్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షులు హన్మంత్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దిలీప్, ఖాసింపూర్ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్, హుగ్గెల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజు, సీనియర్ నాయకులు నర్సింహులు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి 98 లక్షల ఎదులతో పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఆగస్టు 01: మారుమూల మండలమైన కుభీర్ మండలంలో ప్రధాన రహదారుల నిర్మాణం పై దృష్టి సారించనున్నట్లు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలియజేశారు. శనివారం కుభీర్ నుండి దోడర్న తండా 2 పనులకు 98 లక్షల నాన్ గ్రాంట్ ప్లాన్ నిధులతో పనులను ప్రారంభించిన సందర్భంగా అయన మాట్లాడారు. రహదారి నిర్మాణానికి నిధులు సరిపోవని గ్రామస్తులు తెలియజేయడం తో కోటీ రూపాయల నిధులు మాంజురు చేయనున్నట్లు చెప్పారు... అదే విధంగా భైంసా నుండి నిఘ్వ మహారాష్ట్ర బోర్డర్ వరకు 22 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. 42 కోట్ల హమ్ నిధులతో సిరిపెల్లి నుండి పల్సి పార్థి కె మీదుగా కుభీర్ వరకు డబుల్ లైన్ రోడ్ వేస్తున్నామన్నారు... టెండర్ ప్రక్రియ సైతం పూర్తి కావడం జరిగిందన్నారు...కార్యక్రమం లో ఆర్ అండ్ బి అధికారులు,సీనియర్ నాయకులు బోయిడి విఠల్, వద్నం నాగేష్,రాథోడ్ శంకర్ బిజెపి మండల అధ్యక్షులు యేశాల దత్తాత్రి,సర్పంచ్ లు బిజెపి నాయకులు పాల్గొన్నారు

పెరల్ ఇన్ఫినిటీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

హుజూర్ నగర్: ఆగస్టు,01 (వాయిస్ టుడే ప్రతినిధి): హుజూర్ నగర్ పట్టణంలోని పెరల్ ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు మహారాష్ట్రలోని చత్రపతి సంభాజీ నగర్ (ఔరంగాబాద్) లో నిర్వహించిన మోడల్ యునైటెడ్ నేషన్స్ సదస్సులో పాల్గొని ప్రతిభ కనబరిచారు. సదస్సులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శనివారం పాఠశాల సీఈవో చంద్రశేఖర్ ,స్పెషల్ ఆఫీసర్ డిసి ప్రకాష్ లు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఇలాంటి జాతీయ స్థాయి వేదుకల్లో పాల్గొనే అవకాశాలను నిరంతరం కల్పిస్తూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సదస్సులో ప్రతిభ కనబరిచి నగదు బహుమతి, ట్రోఫీ, ప్రశంసా పత్రం అందుకున్న విద్యార్థి మాస్టర్ రహిష్ ను ఈ సందర్భంగా వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జోమి, ఉపాధ్యాయులు , విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

36 ఏళ్ల విద్యాసేవకు ఘన సత్కారం

కె.వి.వి. ప్రసాద్‌రావుకు ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం

నాగార్జునసాగర్, ఆగస్టు 1: (వాయిస్ టుడే): మూడు దశాబ్దాలకు పైగా విద్యారంగంలో విశిష్ట సేవలందిస్తూ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేసిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, హిల్ కాలనీ, సీనియర్ ఉపాధ్యాయుడు కె.వి.వి. ప్రసాద్ రావు ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ సహచర ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషుల సమక్షంలో శనివారము పాఠశాల ఆవరణలో ఘనంగా ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా నందికొండ మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ కౌన్సిలర్లు ఉపాధ్యాయులు కలిసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రసాద్ రావు విద్యాశాఖలో 36 సంవత్సరాల పాటు వివిధ ప్రాంతాల్లో ఉపాధ్యాయునిగా సేవలందించారు. తన సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా, క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, మానవీయ దృక్పథం వంటి అంశాలను పెంపొందించడంలో విశేష కృషి చేశారు. ఆయన బోధనతో తీర్చిదిద్దుకున్న అనేక మంది విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో కొనసాగుతూ ఆయనకు గర్వకారణంగా నిలిచారు.

ఉద్యోగ విరమణ సమయంలో ఆయన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, హిల్ కాలనీ, నాగార్జునసాగర్, పెద్దవూర మండలంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో నందికొండ మున్సిపల్ చైర్‌పర్సన్ స్వర్ణమానస సుమన్, వైస్ చైర్మన్ రాజా ప్రసాద్, 9వ వార్డు కౌన్సిలర్ ఇర్ల రామకృష్ణ, 10వ వార్డు కౌన్సిలర్ వెనిషారాజేష్, పెద్దవూర మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) రాము, కాంగ్రెస్ పార్టీ నాయకులు రామకృష్ణారెడ్డి, రఘువీర్ బిన్నీ, మోహన్ నాయక్, ప్రభుత్వ మోడల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ శేషు, స్టాండర్డ్ స్కూల్ కరస్పాండెంట్ నఫీసాఖాన్ బేగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ రావు సతీమణి గాయత్రి దంపతులను సాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కురుమారెడ్డి, విష్ణుమూర్తి, ది స్టాండర్డ్ స్కూల్ టీచర్స్ తిమ్మయ్య, రామకృష్ణ, వెంకన్న, కుకుడాల మల్లికార్జునరావు, వాసు, సతీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నా భాహు సాఠే 105వ జయంతి

బహుజన్ సాహిత్య ఉద్యమానికి మార్గదర్శకుడు, కార్మిక, దళిత ప్రజల గొంతుక

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)ఆగస్టు 01: అన్నబాహు సాఠే సంఘం ఆధ్వర్యంలో భైంసా పట్టణం లోని అన్నా భావు సాఠే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నిర్మల్ జిల్లా నాయకులు సుంకేట మహేష్ బాబు హాజరై మాట్లాడారు అన్నా భాహు సాఠే పేదరికంలో పుట్టి, కూలీగా పని చేస్తూనే గొప్ప రచయిత అయ్యారు. దళిత, కార్మిక వర్గాల బాధలను ప్రపంచానికి చాటి చెప్పారు. ఆయన త్యాగం నేటికీ కార్మికుల పోరాటానికి స్ఫూర్తినిస్తోంది అని తెలిపారు. అన్నా భాహు సాఠే చదువే సమానత్వానికి మార్గం అని నమ్మారు. ఆయన ఆశయాలైన సామాజిక సమానత్వం, విద్య, ఆత్మగౌరవం కోసం మనం పని చేయాల్సిన అవసరం ఉంది అని కొనియాడారు.

ఆయన కలమే ఆయుధం అని చాటి, పేద, దళిత, కార్మిక ప్రజల జీవితాలను తన రచనలతో వెలుగులోకి తెచ్చారు.ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరం ఆచరిద్దాం. ఈ కార్యక్రమంలో అన్నబాహు సాఠే కమిటీ నాయకులు, కొత్తూరు శంకర్,సాహెబ్ రావ్,మారుతి, బాబు, కాంబ్లె సాహెబ్ రావ్, లక్ష్మణ్, రవి, నాగేష్ యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నా భావు సాఠే ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ప్రతిజ్ఞ చేశారు.

కడం – స్వర్ణ ప్రాజెక్టులను ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురిచేస్తోంది!

పూడికతీత చేయకుండా రైతుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు

బీఎస్పీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ జగన్ మోహన్

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)ఆగస్టు 01: నిర్మల్ జిల్లా రైతాంగానికి జీవనాడిగా ఉన్న కడం మరియు స్వర్ణ ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేస్తోందని,కడం ప్రాజెక్టు సందర్శించి బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నిర్మల్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ జగన్ మోహన్ మీడియాతో మాట్లాడుతూ... దశాబ్దాలుగా ఈ రెండు ప్రాజెక్టుల్లో సమగ్ర పూడికతీత పనులు చేపట్టక పోవడంతో నిల్వ సామర్థ్యం తగ్గుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నా, ప్రభుత్వం మాత్రం నిద్రమత్తులో ఉందని విమర్శించారు. ప్రతి సంవత్సరం వర్షాలు కురిసి ప్రాజెక్టులు నిండగానే మంత్రులు,ఎమ్మెల్యేలు, అధికారులు హడావుడిగా వచ్చి ఫోటోలు దిగడం, మీడియా ముందు గొప్పలు చెప్పుకోవడం తప్ప రైతులకు ఉపయోగపడే ఒక్క శాశ్వత పని కూడా చేయడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వానికి మా సూటి ప్రశ్నలు

కడం, స్వర్ణ ప్రాజెక్టుల్లో ఇప్పటి వరకు సమగ్ర పూడికతీత ఎందుకు చేపట్టలేదు?

రైతుల నీటి భద్రత కంటే ప్రచార రాజకీయాలే ప్రభుత్వానికి ముఖ్యమా?

ప్రాజెక్టుల నిర్వహణకు కేటాయించిన నిధులు ఎక్కడ ఖర్చయ్యాయి?

ప్రతి ఏడాది వరదలు వచ్చినప్పుడు మాత్రమే హడావుడి చేసి,మిగతా రోజుల్లో ప్రాజెక్టులను ఎందుకు గాలికి వదిలేస్తున్నారు?

రైతుల ప్రయోజనాల కంటే ఫోటో సెషన్లకే ఎక్కువ ప్రాధాన్యత ఎందుకు ఇస్తున్నారు?

స్వర్ణ ప్రాజెక్టులో గేట్ల నిర్వహణపై కూడా తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి.గేట్లను తాత్కాలికంగా తాడులతో కట్టే పరిస్థితి ఎందుకు వచ్చింది? నిర్వహణలో జరిగిన వైఫల్యానికి బాధ్యులు ఎవరు? ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలి. ప్రాజెక్టులు నిండితే ఫోటోలు దిగడం కాదు... ప్రాజెక్టులు నిలబడేలా అభివృద్ధి చేయడం ప్రభుత్వ బాధ్యత.

రైతులు ప్రచారం కోరుకోవడం లేదు... పూడికతీత, శాశ్వత నీటి భద్రత కోరుకుంటున్నారని అన్నారు.నీటి పారుదలకుసరైన ఉద్యోగులు కూడా లేరని ఇది నిర్లక్ష్యము కాదా అని ప్రశ్నించారు.

కడం,స్వర్ణ ప్రాజెక్టుల్లో వెంటనే సమగ్ర పూడికతీత చేపట్టాలి.

రెండు ప్రాజెక్టుల గేట్లు,డ్యామ్ భద్రతపై నిపుణులతో ప్రత్యేక సాంకేతిక తనిఖీలు నిర్వహించాలి. నిర్వహణకు ఖర్చు చేసిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి. నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి.

"ఫోటోలు కాదు... పూడికతీత చేయండి

"ప్రచారం కాదు... రైతుల ప్రాణాలను కాపాడండి

"కడం -- స్వర్ణ ప్రాజెక్టులను కాపాడండి..రైతాంగాన్ని ఆదుకోండి అని అడ్వకేట్ జగన్ మోహన్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ జగన్ మోహన్,ఉపాధ్యక్షులు లక్ష్మీ యాదవ్,నియోజకవర్గం ఇంచార్జ్ జోసెఫ్ గంగారాం,పార్టీ సీనియర్ నాయకులు కోక్కరకారి రాజేష్,ఆర్ల రమేష్, పసుపుల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సత్తనపల్లిలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)ఆగస్టు 01: ఖానాపూర్ : ఖానాపూర్ మండలం సత్తనపల్లి లో వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ముందుగా ఏర్పాటు చేసిన నర్సరీని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.అనంతరం మొక్కలు నాటారు.ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషి చెయ్యాలని,మొక్కలు నాటి ప్రకృతి నీ కాపాడాలి అన్నారు.ప్రతి గ్రామంలో వన మహోత్సవాలు ఏర్పాటు చేస్తూ గ్రామాలను పచ్చదనంతో తీర్చిదిద్దాలి అన్నారు.ఈ గ్రామ సర్పంచ్,కాంగ్రెస్ కౌన్సిలర్లు, గ్రామస్తులు,అధికారులు పాల్గొన్నారు.